పార్కు నిర్మాణం.. కలేనా?

- ఆశగా ఎదురు చూస్తున్న రామకృష్ణానగర్‌వాసులు
- ఎన్నాళ్లు నిరీక్షించినా కానరాని ఫలితం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పార్కు నిర్మించాల్సి స్థలం



బోర్డుకే పరిమితమైన రామకృష్ణా వీధి పార్కు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పోర్టు దరి రామకృష్ణానగర్ వద్ద గతంలో డంపింగ్ యార్డు ఉండేది. అయితే దుర్వాసన, పొల్యూషన్ నేపథ్యంలో దాన్ని అక్కడి నుండి తరలించారు. ఆ స్థలంలో పార్కు నిర్మిస్తామని జీవీఎంసీ గతంలో హామీ ఇచ్చింది. అప్పటి నుంచి పార్కు నిర్మాణం మాటల్లోనే ఉండిపోయిందని, చేతల్లోకి రాలేదని స్థానికులు చెబుతున్నారు. పొల్యూషన్ అధికంగా ఉండే ఈ ప్రాంతంలోని ఇళ్ల పైకప్పు నుంచి వేసుకునే దుస్తులు, తినే ఆహారం అన్నింటా ధూళి నిండి ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో కేవలం రామకృష్ణానగర్ మాత్రమే ఈ ఇబ్బందులు ఎదుర్కొనేదని, ఇప్పుడు ఇక్కడ నిర్మించిన టిడ్కో ఇళ్లకూ ఆ బాధ తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంతంలో పార్కు నిర్మించి పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తే ఇక్కడి కాలుష్యానికి వరకైనా అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు.

మందు బాబులకు అడ్డా..

పార్కు నిర్మిస్తామన్న స్థలం ఖాళీగా ఉండడంతో అరాచకాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వన్‌టౌన్ నుంచే కాకుండా కొందరు వ్యక్తులు దూరప్రాంతాల నుంచి కూడా వచ్చి రాత్రిళ్లు మద్యం, గంజాయి సేవించడం వంటి పనులు చేస్తున్నారు. అంతే కాకుండా రౌడీషీటర్లకు కూడా ఈ స్థలం అడ్డాగా మారిపోయిందంటున్నారు. వారిని ప్రశ్నించే ధైర్యం లేక మిన్నకుండిపోతున్నామని చెబుతున్నారు. అంతే కాకుండా విష సర్పాలు కూడా సంచరిస్తున్నాయని వాపోతున్నారు. పార్కు నిర్మాణానికి నివేదిక ఇచ్చామని అధికారులు చెబుతున్నారు కానీ పార్కు నిర్మాణం జాడ మాత్రం కానరావడంలేదని ఈ ప్రాంతీయులు నిట్టూరుస్తున్నారు.

నిత్యం వ్యాధులతోనే...



మా ప్రాంతంలో నిత్యం ఎవరో ఒకరు అనారోగ్యంతో బాధపడుతూనే ఉంటారు. పెద్ద తరం వాళ్లు దాదాపుగా లేరు. వయసులో ఉన్నవారు కూడా తరచూ ఏదో ఒక వ్యాధికి గురవుతూనే ఉన్నారు. మా ప్రాంతంలో పచ్చదనం లేకపోవడమే కారణం. అధికారులు మా సమస్య పరిష్కరించాలి.

– కొండమ్మ, రామకృష్ణానగర్

చూసి వెళ్లిపోతున్నారు..



ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం పార్కు నిర్మిస్తామని చెప్పిన అధికారులు నివేదికలతోనే సరిపెడుతున్నారు. చూసి వెళ్లిపోతున్నారు తప్ప చేసిందేమీ లేదు. ఇప్పటికైనా మా ప్రాంతంలో పచ్చదనం పెంపొందించి, మంచి పార్కు ఏర్పాటు చేయాలి.

– నూరిబాబు, రామకృష్ణానగర్

చెట్లు పెంచితే ఎంతో మేలు..



రామకృష్ణానగర్ పొల్యూషన్‌తో కూడుకున్న ప్రాంతం. ఇక్కడ పచ్చదనం పెంపొందించాల్సి ఉంది. అందులో భాగంగా డంపింగ్ యార్డు తొలగించిన స్థలంలో పార్కు నిర్మించి విరివిగా చెట్లు పెంచితే ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుంది. అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కోరుతున్నాం.

– వియ్యపు రమేష్, రామకృష్ణానగర్

పార్కు నిర్మాణానికి పూనుకోవాలి..



పొల్యూషన్ కోరల్లో చిక్కుకుని అనారోగ్యం పాలవుతున్నాం. ఇప్పటికే ఇంటికి ఒకరిద్దరు చొప్పున రోగాల బారిన పడి ఉన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి మా ప్రాంతంలో పార్కు నిర్మించాలి.

– అప్పలకొండ, రామకృష్ణానగర్

పార్కు నిర్మాణానికి ముందుకు రావాలి..




రామకృష్ణానగర్, చిలకవీధి ప్రాంతాలకు ఉపయోగకరంగా ఉండేలా పార్కు నిర్మించాలి. అలా చేస్తే ఈ ప్రాంతాల వాతావరణంలో మార్పులు వస్తాయి. ప్రజలు అనారోగ్యం నుండి కోలుకుంటారు. అధికారులు ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సన్యాసిరావు, రామకృష్ణానగర్

క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

సమాచార శాఖ డీడీ రమేశ్‌కు ఆత్మీయ వీడ్కోలు



ఏడీగా పదోన్నతి పొందిన రమేష్‌ను సత్కరిస్తున్న అధికారుల, సిబ్బంది

మహారాణిపేట: సమాచార కేంద్రంలో ఏడీగా సేవలందించి ఇటీవల డీడీగా పదోన్నతి పొందిన దున్న రమేశ్‌కు ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. శుక్రవారం సాయంత్రం సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ కార్యాలయంలో రమేశ్‌కు చిరు సత్కారం చేసి జ్ఞాపిక అందజేశారు. ఆయన సేవలను కొనియాడుతూ ప్రశంసించారు. డీడీ కె. సదారావు, డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, ఏపీఆర్‌వో శ్రీనివాసరావు, ఏపీఎస్ వెంకటరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్‌వో కిశోర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రమేశ్ విజయవాడ డైరెక్టరేట్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మహిళా సాధికారత కోసమే 'మిషన్ శక్తి'

మద్దిపాలెం: మహిళా సాధికారత పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని అర్బన్ సీడీపీవో నీలిమ తెలిపారు. ఆర్ అండ్ బీ జంక్షన్ సమీపంలోని ఓ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంకల్ప్‌లో భాగంగా ఈ నెల 2 నుంచి 12 వరకు 10 రోజుల పాటు ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహించామన్నారు. బేటీ బచావ్ – బేటీ పఢావ్, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళలు – కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సమాజంలో జరిగే నేరాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యమూ అవసరమే



ఆహార పదార్థాల రుచి చూస్తున్న సీపీ బాగ్చి

సీతంపేట: యువతకు విద్యతో పాటు ఉపాధి సాధనకు అవసరమైన నైపుణ్యమూ అవసరమే అని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతు బజార్ వద్ద గల క్రూజ్ కాలనరీ అకాడమీ అఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్‌నెస్, రోడ్ సేఫ్టీ, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన ఆహార పదార్థాలను సీపీ తిలకించి రుచి చూశారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ హెడ్ టీకే ప్రభాకర్, టూరిజం అసిస్టెంట్ మేనేజర్ బసంత్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'మిషన్ తమసోమ జ్యోతిర్గమయ'

పోలీసుల సహకారంతో అయిన వారి చెంతకు అభాగ్యులు



లింగాలును కూతురు జ్యోతికి అప్పగిస్తున్న టూటౌన్ పోలీసులు



అప్పలస్వామిని కూతురు శ్యామలకు అప్పగిస్తున్న టూటౌన్ పోలీసులు

అల్లిపురం: పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తలపెట్టిన మిషన్ తమ సోమా జ్యోతిర్గమయ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. యాచకులుగా నగరంలో తిరుగుతున్న వారిని వారి బంధువులకు అప్పగిస్తున్నారు. అవసరమైన వారికి వైద్యం అందజేస్తున్నారు. గత నెల 14వ తేదీన పోలీసులు బంకి లింగాలు (56)అనే వ్యక్తిని రెస్క్యూ చేశారు. అతని వివరాలు తెలుసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా బోరుభద్ర గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. అతని కుమార్తె జ్యోతి తన తండ్రి పది రోజులు గడిచినా ఇంటికి రాలేదని ఆందోళన చెంది వెతకడం ప్రారంభించింది. చివరికి ఏయూటీడీ జీవీఎంసీ భీమ్‌నగర్ షెల్టర్‌లో ఉంటున్నాడని తెలుసుకుని షెల్టరుకి వచ్చింది. కొడుకు దగ్గర ఉండటం ఇష్టం లేక పెళ్లికి వెళ్తున్నానని వచ్చేసి వైజాగ్ రోడ్లపై తిరుగుతున్నాడని కూతురు తెలిపింది. దీంతో 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఏఎస్ఐ కాంతమ్మ, హెచ్‌సీ ప్రకాష్‌రావు సమక్షంలో కూతురు జ్యోతికి తండ్రిని శుక్రవారం అప్పగించారు. అదే విధంగా విజయనగరం జిల్లా భోగాపురం, పెద సుబ్బవానిపాలెం గ్రామ నివాసి అయిన పోతిరెడ్డి అప్పలస్వామి (66) కొడుకుతో పడకపోవడంతో నగరానికి వచ్చి భిక్షాటన చేస్తూ బతుకుతున్నాడు. అతన్ని తమసోమ జ్యోతిర్గమయ కార్యక్రమంలో పోలీసులు పట్టుకున్నారు. అంతకు ముందు కూడా ఈ వ్యక్తిని ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసి అతని సొంతూరు తీసుకె కుటుంబానికి అప్పగించారు. అయినా అతను భిక్షాటన మానలేదు. మరలా తండ్రి నెల రోజులుగా ఇంటికి రాకపోవడంతో కూతురు వెతుక్కుంటూ ఏయూటీడీ జీవీఎంసీ భీమ్‌నగర్ షెల్టర్‌కు వచ్చింది. 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కానిస్టేబుల్ ఎ. శ్రీనివాసరావు సమక్షంలో కూతురు శ్యామలకు తండ్రిని అప్పగించారు. మరొకమారు భిక్షాటనకు వస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించి పంపించారు.

కూటమి మోసాలపై ఇంటింటి ప్రచారం



మూడు గుళ్ల ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ముత్తాబత్తుల రమేష్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బూత్ నంబర్ 67 పరిధి మూడు గుళ్ల ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో గడపగడపకూ వెళ్లి బాబు మోసపూరిత హామీల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, హేమాలక్ష్మి, కొల్లు సత్యవతి, బూరుల చిన్న, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, పీవీ శిరీష, ఏవిఎన్ రెడ్డి, కృష్ణారెడ్డి, బాల నారాయణరెడ్డి, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, సిద్ధేశ్వరరావు, కనిగిరి సంతోష్ కుమార్, బాడుగుల శ్రీనివాసరావు, చికెన్ రాము, ధర్మారావు, సత్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో జాతీయ ప్రోగ్రామర్స్ డే



విజేతలతో అధ్యాపకులు, అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో ఉన్న సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ప్రోగ్రామర్స్ డేను పురస్కరించుకుని అంతర్ కళాశాలల ఫెస్ట్ 'డేవ్ కాన్' ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, కంప్యూటర్ సైన్స్ విభాగాధ్యక్షులు కె.నాగ శిరీష, పి.కె.జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫెస్ట్‌లో భాగంగా టెక్ మీమ్, కోడింగ్ చాలెంజ్, డీబగ్గింగ్ క్వెస్ట్, ట్రెజర్ హంట్, ఐడియాథాన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిజమ్, ఏవీఎన్, కృష్ణా కళాశాలల విద్యార్థినులు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో జి.దీప్తి, ఎస్.మాధురి, జె.అనితరాణి, కుంకుం ధారా, కె.ఎస్టేర్‌లిల్లీ, కృష్ణ ప్రసాద్ సాహు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో వసతులు కల్పించాలని ర్యాలీ



సీతమ్మధార అల్లూరి విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్తున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు

తాటిచెట్లపాలెం: దువ్వాడ ట్రై జంక్షన్, తలారివానిపాలెం ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ లబ్ధిదారులు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఉత్తర ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. టిడ్కో ఇళ్లకు కట్టాల్సిన ఈఎంఐల కంటే ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందని, తమ గృహాలకు కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేదని వీరు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ రెండు ప్రాంతాల్లోని 4,800 గృహాలకు సంబంధించి రోజుకు 26 లక్షల లీటర్ల తాగునీరు అవసరం కాగా.. నీటి కొరత అధికంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, మౌలిక వసతుల విషయమై శాసనసభలో ప్రస్తావించానని, త్వరలోనే మళ్లీ మాట్లాడి పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడ్కో గృహ లబ్ధిదారుల పోరాట నాయకుడు, సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారయణ, జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, ఎన్.నాగభూషణం, టిడ్కో గృహ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

స్విగ్గీ-జొమాటో రైడర్ల సమ్మెకు సిటు మద్దతు

డాబాగార్డెన్స్: స్విగ్గీ, జొమాటో రైడర్ల డిమాండ్లను పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన రేట్లు పునరుద్ధరించాలని, అన్యాయంగా తొలగించిన రైడర్లకి ఐడీలు తిరిగి ఇవ్వాలని కోరుతూ చేపట్టిన సమ్మెకు సిటు మద్దతు ప్రకటిస్తోందని ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జొమాటో సంస్థ ఈ ఏడాది రూ.974 కోట్ల లాభం పొందిందని, లాభాల వెనుక రైడర్స్ కష్టం ప్రధానమని, అలాంటి రైడర్ల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. 13, 14 తేదీల్లో స్విగ్గీ, జొమాటో ఆర్డర్లు ఇవ్వకుండా విశాఖ ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ జోక్యం చేసుకుని రైడర్స్ సమస్యలు తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిటు డిమాండ్ చేస్తుందన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. వీటిలో జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి రెండు, జోన్–3 నుంచి మూడు, జోన్–4 నుంచి రెండు, జోన్–5 నుంచి ఐదు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–8 నుంచి తొమ్మిది వినతులు అందాయి. నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీసీపీ ఆదేశించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఉపాధి కూలీకి అండగా కార్పొరేటర్ పూర్ణిమ



ఫ్రాన్సిస్‌కు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి రే వీధిలో నివాసం ఉంటున్న ఫ్రాన్సిస్‌కు ఎటువంటి ఉపాధి లేక, ప్రభుత్వం నుంచి పెన్షన్ అందక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ స్పందించారు. వార్డు కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ చేతుల మీదుగా ఫ్రాన్సిస్‌కు వైద్య ఖర్చులకు రూ.5 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ యూపీహెచ్‌సీల్లో సరైన వైద్యం అందడం లేదన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేసి ఇంటి వద్దకే వైద్యం అందించేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అటువంటి సేవలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో పేద ప్రజలకు ఏటువంటి సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాని మధు, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ సభ్యులు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరిగిపోతోందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగువ అచ్యుతరావు విమర్శించారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరుద్యోగి ఆవేదన సదస్సు పోస్టరు ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 18 నుంచి జరగనున్నాయని ఈ సమావేశాల్లో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని కోరారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఎప్పుడు ప్రారంభిస్తారో, విధి విధానాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కార్పొరేట్ కంపెనీలకు తక్కువ ధరకు ఇస్తున్నప్పటికీ అవి కార్యకలాపాలు నిర్వహించటం లేదని దీని వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి దొరకడం లేదన్నారు. మంత్రులు ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్నారని అన్నారు. టీసీఎస్, కాగ్నిజెట్, ఆదాని డేటా సెంటర్లు తక్షణమే తమ కార్యకలాపాలు నిర్వహించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఏడాదిన్నర లో ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలన్నారు. జనవరిలో ఉద్యోగాల నోటిఫికేషన్ ప్రకటించాలని, అమరావతి ఫ్రీజోన్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే డిమాండ్లతో ఈనెల 17న విజయవాడలో జరగనున్న నిరుద్యోగి ఆవేదన సదస్సులో పెద్ద ఎత్తున యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి కొమరం సందీప్, సభ్యులు హేమంత, ఉదయ్, దుర్గా అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం విశాఖ వస్తున్నారు. గన్నవరం నుంచి విమానంలో ఉదయం 8.15 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 14న విశాఖ రైల్వే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. రెండు గంటలకు రోడ్డు మార్గం ద్వారా విజయవాడ వెళతారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ విక్రయం నేరం

మహారాణిపేట: ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. విజయకుమార్ హెచ్చరించారు. శుక్రవారం సిరిపురంలోని చిల్డ్రన్స్ ఎరీనాలో జిల్లా డ్రగ్ అసోసియేషన్, స్మార్ట్ విశాఖ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కెమిస్టులు, డ్రగ్గిస్టులు నిరంతర పర్యవేక్షణలో ఉన్నారని, వారిపై తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. స్వర్ణలత యాంటీబయోటిక్స్ వినియోగం, వాటి దుష్ప్రభావాలపై ప్రసంగించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ రావు ఆన్‌లైన్ నేషనల్ డ్రగ్స్ లైసెన్సింగ్ సిస్టమ్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలపై వివరణ ఇచ్చారు. సేల్స్ లైసెన్సింగ్ సిస్టమ్‌లో దరఖాస్తులు, అనుమతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.అభిప్రియ, కనకల్యాణి, ఇందిరా భారతి, ఎస్.కల్యాణి, సుమారు 650 మంది ఫార్మసిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యం



స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న ఐఏఎస్ఈ అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: గాంధీ జయంతి స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ కళాశాలలో ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీతో కలిసి సంయుక్తంగా అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఐఏఎస్ఈ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ నగరాజ కుమారి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో పరిసరాల స్వచ్ఛత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం ఏయూ పరిసర ప్రాంతాలను శుభ్రపరచడంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు.